**కామెడీ కథ**

**-జొన్నకూటి మార్టిన్ ఫిన్‌లె**

# శ్రీమతి...శ్రీఘ్రశ్రీ...

"హేమండీ.. మీకో గుడ్ న్యూస్" అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన భర్తకు కాఫీ అందిస్తూ అంది సుబ్బులక్ష్మి.

భార్య చెప్పబోయే ఆ గుడ్ న్యూస్ ఏమై వుంటుందో తెలుసుకోవాలనే ఉత్సాహం లోలోపలనుంచి ఉబికివస్తోన్నా పైకి, గాంభీర్యం నటిస్తూ... " ఏమిటో... అంత గుడ్ న్యూస్" అడిగాడు చిదానందం.

"ఎంతో కాలంగా నాకో తీరని కోరిక వుందండి. ఇన్నాళ్ళకు అది తీరబోతోంది" అంది సుబ్బులక్ష్మి ఆనందంగా.

"ఐతే అది నాకెలా గుడ్ న్యూస్ అవుతుంది? అయినా నీకు తీరని కోరిక లేమైనా వుంటే నీ పుట్టింటికి వెళ్ళినపుడు తీర్చుకోవాలి. అంతేకాని నా జేబుకు చిల్లు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టకూడదు" అన్నాడు జేబును చేత్తో ఒడిసి పట్టుకుంటూ.

"హూ... ఇన్నేళ్ళ కాపురంలో మీ సంగతెల్తెలిసి అంత సాహసం నేనెందుకు చేస్తాను. నా 'కోరిక' ఖర్చుతో కూడుకున్నది కాకపోగా మనకే ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది" అంది సుబ్బులక్ష్మి గడుసుగా.

చిదానందం మొహంలోకి ఒక్కసారిగా వెలుగొచ్చింది.

"డబ్బుతో తీర్చుకోవాల్సిన కోరికలుంటాయి. తెలుసు. కాని... మనకే డబ్బుని తెచ్చిపెట్టగల నీ ఆ కోరికేమిటో? దాని కథా కమామీషేమిటో? కాస్త వివరంగా చెప్పు" అన్నాడు ఇంతకుముందు భయాన్నించి రిలాక్సయి, సోఫాలో వెనక్కి వాలుతూ.

"ఉహూ... నేను చెప్పను. చూపిస్తాను" హార్లిక్స్ తాగను. తింటాను' అన్న యాడ్ ఎక్స్‌ప్రెషన్ని ఇమిటేట్ చేస్తూ ఓ కవరు చేతికందించింది సుబ్బులక్ష్మి.

ఆత్రంగా కవర్లోపలి కాగితాల్ని బయటకు లాగాడు చిదానందం.

ప్రేక్షకబంధు,

శ్రీమతి సుబ్బులక్ష్మి గారికి,

'క్యా' టీవీకి మీర్రాసిన ఉత్తరం అందింది. మా 'శ్రీమతి శీఘ్ర శ్రీ' ప్రోగ్రాంలో మీరు పార్టిసిపేట్ చేయడానికి ఉత్సాహంగా ముందుకు వచ్చినందుకు మా అభినందనలు. వచ్చేవారం మా బృందం మీ ఇంటికి వస్తుంది. తయారుగా వుండండి'.

'క్యా' టీవీ

ప్రోగ్రామ్ మానేజర్

టీవీలో వచ్చే ఆడవాళ్ళ కార్యక్రమాలపై అంతగా ఆసక్తి, అవగాహన లేని చిదానందానికి ఆ లేఖలోని సారాంశం బొత్తిగా అర్థం కాలేదు. కవరుని భార్య చేతికి తిప్పి యిస్తూ... ఏదో అడగబోయేంతలో....

"మీ మొహం చూస్తేనే అర్థం అవుతుంది. మీకేం అర్థం కాలేదని... 'క్యా' టీవీలో శ్రీమతులకు ప్రత్యేకంగా ఓ ప్రోగ్రాం వస్తుంది. మొత్తం నలుగురు శ్రీమతులు పార్టిసిపేట్ చేయాలీ ప్రోగ్రాంలో. దానికి నేను పార్టిసిపేట్ చేస్తానని ఉత్తరం వ్రాసాను. దానికి ఆమోదం తెలుపుతూ 'క్యా' టీవీ వారు వ్రాసిన ఉత్తరం ఇది" అంది సుబ్బులక్ష్మి చేతిలోని కవర్‌ని మొహం పక్కగా పెట్టి ఆడిస్తూ.

"కంగ్రాట్స్! కాని...."

"ఆగండాగండి... నాకు తెలుసు మీరేం అడగబోతున్నారో.... దీనికోసం మనం స్టూడియోల చుట్టూ తిరగక్కర్లేదు. షూటింగ్ మధ్యలో తిండి కోసం మన డబ్బులు ఖర్చు పెట్టుకోనక్కర్లేదు. ఎందుకంటే షూటింగ్ కోసం వాళ్ళే మన ఇంటికి వస్తారు. మన ఇంట్లోనే షూట్ చేస్తారు. దీనిక్కావలసిందల్లా నలుగురు శ్రీమతులు. నన్ను మినహాయిస్తే ఇంకా ముగ్గురు కావాలి."

"నిఝమా...! ఐతే ఆలిశ్యం లేకుండా ఆ ముగ్గురు 'పిల్ల'లని వెతికి పట్టుకో. నేన్రెడీ..." అన్నాడు చిదానందం ముసిముసిగా నవ్వుతూ.

"అఘోరించార్లెండి. ఈ తెలివి తేటలకేం తక్కువ లేదు. మన ఫ్లాట్‌లో సుగుణ సాఫ్ట్ టాయ్స్‌లో నేర్పరి. కింద ఎడం వైపు ఫ్లాట్‌లో వుండే కుముద కుట్లు... అల్లికల్లో నెంబర్ వన్. ఇంక మన అపార్ట్‌మెంట్ పక్కనే వున్న ఇండిపెండెంట్ హౌస్‌లో అద్దెకుండే పద్మజ శారీ పెయింటింగ్స్‌లో ఎక్స్‌పర్ట్. వాళ్ళని దృష్టిలో పెట్టుకునే నేను 'క్యా' టీవీకి ఉత్తరం రాసాను. టీవీవాళ్ళు ఓ.కే. అన్నారు. కాబట్టి ఇప్పుడిక వీళ్ళతో మాట్లాడుతాను" అంది ఉత్సాహంగా.

"మొత్తమ్మీద భలేదానివోయ్. ఒక్క క్షణం నన్నెంత ఆశ పెట్టేశావని...." అన్నాడు చిదానందం సుబ్బులక్ష్మి కేసి ఓరకంట చూస్తూ.

"హు. మీకంత సీన్లేదులెండి. క్రియేట్ చేయాలని చూస్తే.... నిర్దాక్షిణ్యంగా ఎడిటింగ్ చేసి పారేస్తాను..." హుంకరించి, వంటింట్లోకి వెళ్ళిపోయింది సుబ్బులక్ష్మి.

* * *

ఆ రోజు భర్త ఆఫీసుకెళ్ళిపోయిన తర్వాత 'క్యా' టీవీ బృందం వస్తారని తనకు అంతగా ఇష్టం లేకపోయినా 'క్యా' టీవీలో వచ్చే ప్రొగ్రామే చూస్తూ కూర్చుంది సుబ్బులక్ష్మి తలుపు బార్లా తెరిచి మరీ.

కొద్దిసేపటికి హఠాత్తుగా లోపలికి అడుగుపెట్టిన ఇద్దరు అపరిచితులని చూసి, కెవ్వుమని "దొంగ.... దొంగ..." అని అరవడం మొదలెట్టింది.

దాంతో బెదిరిన ఆ ఇద్దరూ... " ఆపవమ్మా ఆపు.... కొంచెం వుంటే దొరల్లాంటి మమ్మల్ని దొంగలని చేసేసేలాగున్నావు. ఇలా అయితే మేం 'శ్రీమతి శీఘ్ర శ్రీ కార్యక్రమం రద్దు చేసుకుంటాం" అన్నారు ముక్తకంఠంతో.

"అయ్యో! మీరు 'క్యా' టీవీవాళ్ళా... ఈ మధ్యన నగరంలో పట్ట పగలే దోపిడీలు జరుగుతున్నాయి కదా! అందులోనూ మీ భుజమ్మీద

కెమెరా లేదు. పక్కన ఆడ యాంకరూ లేదు. అందుకని..." నసిగింది సుబ్బులక్ష్మి.

"నర్సరే... ప్రోగ్రాం మీ ఇంట్లోనే ఫిక్స్ చేశారా... మరెక్కడైనానా...?"

'నాతోపాటు మా ఇల్లు కూడా టీవీలో పడొద్దా? ఆ అవకాశం నేను ఇంకొకరికెందుకిస్తాను' మనసులో అనుకుని,

"మా ఇంట్లోనే" చెప్పింది మొహం విప్పార్చి.

"ఐతే... ఈ హాలుని పెయింటింగ్ చేయించాలి. కలర్ పెయింటింగ్"

"మొన్ననే దసరాకి ఇల్లంతా పెయింటింగ్ చేసాము" చెప్పింది సుబ్బులక్ష్మి ఏ మాత్రం మాయని తెల్లని గోడలవంక చూస్తూ.

"చూడండి. నేను కెమెరామెన్ని. వైట్ పెయింటింగ్‌లో పిక్చర్ క్వాలిటి సరిగా రాదు. ప్రోగ్రాం క్వాలిటీ బావోపోతే... మొత్తం 'క్యా' టీవీకే మచ్చొస్తుంది" అన్నాడు.

'తను ఉత్తరం రాయగానే తనకు అవకాశం ఇచ్చిన 'క్యా' టీవీకి మచ్చా... న్నో...!' తలూపింది సుబ్బులక్ష్మి అప్రయత్నంగా.

"తర్వాత, త్రీ పీస్ సోఫాసెట్ 'యు' షేప్‌లో వేసి మధ్యలో టీపాయ్, దాని మీద ఫ్లవర్‌వాజ్ ఏర్పాటు చేయాలి"

టీ పాయ్ అంటే సరే... కాని త్రీ పీస్ సోఫా సెట్టంటే...." నసిగింది సుబ్బులక్ష్మి.


"మీరిలా నసిగితే... ఇక ఈ ప్రోగ్రాం ఐనట్టే. మా 'క్యా' టీవీ షూట్ చేయడానికి ఇవి మినిమంగా కావలసినవి. ఖర్చుకి వెనుకాడితే ఎలా? అయినా గిఫ్ట్ హ్యాంపర్లు, గోల్డ్ కాయిన్స్ రూపంలో మీకు అంతకు అంతా ముట్ట చెపుతుంది కదా మా 'క్యా' టీవి!" విసుకున్నాడు పేరైనా చెప్పని ఆ అపరిచితుడు.

'ఔనౌను, 'క్యా' టీవీ ఛానల్‌కి తగినట్టుగా వారి ప్రేక్షకుల ఇళ్ళల్లో కూడా రిచ్‌నెస్ కొట్టొచ్చినట్టు కనిపించాలి మరి' అనుకుంటూ 'అలాగే'నంది.

"నలుగురు శ్రీమతులలో ఒకరు తమకు ఇష్టమైన వంటకం చేసి చూపించాల్సి వుంటుంది. మీ ఇంట్లో ప్రోగ్రాం కాబట్టి మీరే వంట చేయాల్సి వుంటుంది. అందుకోసం వంటిల్లు నీట్‌గా వుంచాలి. పాత్రలన్నీ కొత్తవై వుండాలి. లేకపోతే మా 'క్యా' టీవీకి...."

"మచ్చొస్తుంది.... మచ్చొస్తుంది" టక్కున అందుకుంది సుబ్బులక్ష్మి.

"వెరీ గుడ్! ఇలా చెప్పగానే అలా అల్లుకుపోగలిగే వాళ్ళుంటే మా పని సులువవుతుంది. కీపిటప్" అంటూ అభినందించి, మరికొన్ని సూచనలు చేసి, షూటింగ్ డేట్ ఫిక్స్ చేసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు.



* * *

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చిన భర్తకి 'క్యా' టీవీవాళ్ళు రావడం దగ్గర్నించి వాళ్ళు ప్రోగ్రాం కోసం చేసిన సూచనలన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది సుబ్బులక్ష్మి.

"ఇవన్నీ చేయాలంటే ఎంతవుతుందో తెలుసా? ఇరవై వేలకి తక్కువ కాదు. ఏం తమాషాగా వుందా?" చిదానందం తోక తొక్కిన కోతిలా చిందులేశాడు.

"కానివ్వండి..." అంది సుబ్బులక్ష్మి నిర్లక్ష్యంగా.

"టీవీలో కనిపించాలనే నీ కోరిక తీరడం కోసం వేలకు వేలు నన్ను ధారపోయమంటావా? నీకేమన్నా మతిపోయిందా" అరిచాడు చిదానందం.

"పోలేదు. పోదు కూడా! ఇంత కాలంగా ధారావాహికంగా ఈ ప్రోగ్రామ్ నడుస్తోందంటే ఇంత ఖర్చుని భరించి పార్టీసిపెంట్స్ పాల్గొంటున్నట్టే కదా! అంటే వాళ్ళకి తగినంతగా ముడుతుందనేగా... కేవలం సరదాకోసమే ఎవరూ పార్టిసిపేట్ చేయరు కదా! ఆలోచించి చూడండి. శ్రీమతి అంటే ఇల్లాలు కదా... శ్రీఘ్రు అంటే త్వరితంగా... శ్రీ అంటే ధనం... పేరులోనే వుంది కదా. పైగా 'దేనికమ్మా ఖర్చుకి వెనుకాడుతారు. మీకు అంతకు అంతా ముడుతుంది' అని ఆ వచ్చినవాళ్ళు కూడా చెప్పారు. మనచేత ఇరవై ఖర్చు పెట్టించారంటే నలభై తప్పకుండా ముట్టజెపుతారు. అదీ గోల్డు కాయిన్స్ రూపంలోనట.

అంటే దగ్గర దగ్గర ఐదు తులాల మాటే. నగలు చేయించమని మిమ్మల్ని ఎంత పోరుతున్నాను. కనీసం ఇలానైనా సమకూర్చుకోనివ్వండి. అట్టే ననక్కండి" అంది సుబ్బులక్ష్మి అల్టిమేటం ఇచ్చేస్తూ.

భార్య రీజనింగ్‌తో చిదానందం కొంచెం కుదుటపడ్డాడు. "సరే... కానివ్వు" అన్నాడు.

* * *

అనుకున్న రోజు రానే వచ్చింది.

అనుకున్న సమయానికి అన్నీ సిద్ధం చేసుకుని, సుగుణ, కుముద, పద్మజలతో ఎదురు చూస్తూ కూర్చుంది సుబ్బులక్ష్మి. తలుపు మీద టక టక శబ్దం వినిపించి లేచి వెళ్దామనుకుంటున్నంతలోనే తోసుకుంటూ లోపలికొచ్చిన యాంకర్ అందర్నీ చూసి పళ్ళికిలిస్తూ... "హాయ్! ఎవ్రీబడీ... ఆశ్చర్యపోతున్నారా? నా సడన్ ఎంట్రీ చూసి..." అంది అల్లరిగా నవ్వుతూ చేతిని వూపుతూ.

యాంకర్ ఏం మాట్లాడినా... ఎలా మాట్లాడినా నవ్వుతూ భరించాలన్న కామన్ సెన్స్ కలదై "రండి మీకోసమే ఎదురుచూస్తున్నాం" అంది సుబ్బులక్ష్మి ఆహ్వానిస్తూ.

యాంకర్... యాంకర్ వెనుక కెమెరామెన్, ఎపిసోడ్ డైరెక్టర్, లైట్‌బాయ్ అంతా లోనికి వచ్చారు. అందర్నీ సాదరంగా ఆహ్వానించి అల్పాహారంతో పాటు జ్యూస్‌లు అందించింది సుబ్బులక్ష్మి.

డైరెక్టర్ సూచన మేరకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక షూటింగ్ మొదలైంది.

మొదటగా పరిచయ కార్యక్రమం... ఒక్కో శ్రీమతీ తనే ఏం చేస్తుందీ... తన శ్రీవారేం చేస్తుందీ... ఎంత మంది పిల్లలు... హాబీలు... వగైరా... వగైరా...

తర్వాత ఒక్కొక్కరు తమ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలు....

సుగుణ తను తయారు చేసిన సాఫ్ట్ టాయ్స్‌ని... కుముద తను కుట్టిన కుట్లు... అల్లికలు... పద్మజ తను వేసిన శారీ పెయింటింగ్స్.... అన్నీ యాంకర్‌కి చూపించారు.

"వ్వావ్... ఇంట్లో వుండే శ్రీమతులలో ఇంతటి నైపుణ్యం దాగివుంటుందంటే ఆశ్చర్యమే" క్లాప్స్ కొట్టింది యాంకర్.

తర్వాత "మీ భర్త తాగి ఇంటికి వస్తే మీరెలా గొడవ పడతారు. దానికి ఆయన రియాక్షన్ ఎలా వుంటుందో అభినయించి చూపించాలి" అంది. ఒక్కరొక్కరుగా అందరూ అభినయించి చూపారు. అందరి గొడవా శ్రద్ధగా వింది యాంకరు పిల్ల. ఆపై సుబ్బులక్ష్మికేసి చూస్తూ, " ఆ... చెప్పండి మీరేం వంటకం చేయబోతున్నారు" అడిగింది వంటింట్లోకి నడుస్తూ.

"హనీ లడ్డు" చెప్పింది సుబ్బులక్ష్మి.

"వ్వావ్! ఇదేదో కొత్త ఐటమ్ లాగుంది. పేరు వింటూంటేనే నోట్లో నీళ్ళూరుతున్నాయి. మరి తొందరగా చేస్తే ఓ పట్టు పట్టేస్తాను" అంది యాంకర్.

అలాంటి ఎక్స్‌ట్రా మాటలు యాంకర్లు మాట్లాడుతూనే వుంటారని తెలిసిన సుబ్బులక్ష్మి "తప్పకుండా" అంటూ వంటలో పడింది.

వంట పూర్తవడంతోనే ఎంతో ఆత్రంగా టేస్ట్ చేసిన యాంకర్ "వ్వావ్, వెరీ నైస్" అంటూ ఇచ్చిన కితాబుకి కిలకిలా నవ్వింది సుబ్బులక్ష్మి.

ఆ తర్వాత, సుగుణకు, కుముదకు, పద్మజకు, గిఫ్ట్ హ్యాంపర్లందజేసి, సుబ్బులక్ష్మికేసి తిరిగి, పావుకేజి స్వీట్ బాక్స్ అంత బాక్స్‌ని అందించింది.

"కంగారు పడకండి. వాళ్ళందరికి అంత పెద్ద గిఫ్ట్ హ్యాంపర్లందజేసి, నాకేమిటింత చిన్న బాక్సు అనుకోకండి. మీరు ఈ టీమ్ లీడర్ కదా! అందుకే మీకు స్పెషల్... ఇంతకీ మీ బాక్స్‌లో గెస్ చేయగలరా?" అడిగింది సుబ్బులక్ష్మి నోటి ముందు మైక్‌ని వుంచి.

గోల్డ్ కాయిన్స్ అన్న నిజం తెలిసినా తెలీని దానికి మల్లే మొహం పెట్టి " ఉహూ... మీరే చెప్పండి" అంది అమాయకంగా.

"టెన్షన్‌గా వుంది కదూ. టెన్షన్ ఎలా వుంటుందో నాకు తెలుసు. కాబట్టి మిమ్మల్ని టెన్షన్ పెట్టను. చెప్పేస్తాను. దీనిలో ఏమున్నాయంటే...." టెన్షన్ ( ఆడియన్స్‌లో) బిల్డప్ చేయడానికన్నట్టుగా ఆగి "గోల్డ్ కాయిన్స్" అంది పెద్దగా నవ్వేస్తూ.

అంతే! హాలంతా ఒక్కసారిగా చప్పట్లతో మోగిపోయింది. సుబ్బులక్ష్మి మొహం వేయి వోల్టుల బల్బులా వెలిగిపోయింది.

"బై" అంటూ యాంకర్ బైటకు నడవడంతో షూటింగ్ ముగిసింది.

ఐదు నిముషాలలో 'క్యా' టీవీ యూనిట్ వెళ్ళిపోయింది.

* * *

సాయంత్రం భర్త వచ్చిన తర్వాత అతడి సమక్షంలోనే విప్పాలని గోల్డ్ కాయిన్స్ బాక్స్ కళ్ళురిస్తూన్నా ఎలాగో ఉగ్గబట్టి, రాగానే కాఫీ కంటే ముందు కాయిన్స్ బాక్స్ అందించింది.

"వ్వావ్ మొత్తానికి సాధించావ్" అన్నాడు చిదానందం మెచ్చుకోలుగా చూస్తూ, మొహాన్ని మతాబులా వెలిగిస్తూ.

'మరేమిటనుకున్నారు. సుబ్బులక్ష్మా మజాకా...' అన్నట్టుగా ఓ ఫోజిచ్చి, "అబ్బ త్వరగా విప్పండి" అంది.

చిదానందం బ్రహ్మానందం లెవెల్లో, "వస్తున్నా... అక్కడికే వస్తున్నా" అంటూ గిఫ్ట్ రేపర్‌ని చించాడు.

ఫైబర్ స్క్వేర్ బాక్స్... అది.

సుబ్బులక్ష్మి కళ్ళింత చేసుకొంది భర్త మూత తెరుస్తుంటే.

లోపల మళ్ళీ ఇంకొక బాక్స్... దాన్ని మూత తెరిస్తే... మళ్ళీ ఇంకో బాక్స్... దర్శనమిచ్చింది. చా...లా... చిన్నది!

సుబ్బులక్ష్మిలో టెన్షన్ పెరిగిపోతోంది. అలాంటి టెన్షన్ క్రియేట్ చేయడం కోసమే బహుశా ఇలా ప్యాక్ చేసారేమో... అన్న అనుమానం కూడా కలిగింది.

ఉద్వేగం తన్నుకొస్తుంటే వణుకుతోన్న చేతులతో ఆ బాక్స్ మూత తెరిచాడు చిదానందం. మొదట అతడి కళ్ళలోకి కాంతి వచ్చింది. ఆ తర్వాత క్షణం దబ్బున సోఫాలో విరుచుకుపడిపోయాడు. చెప్పాలా? సుబ్బులక్ష్మి కూడా డిటో!

* * *

ప్రస్తుతం సుబ్బులక్ష్మి చిదానందం తమ ఇంటికి స్నేహితులు, బంధువులు ఎవరు వచ్చినా తాము పార్టిసిపేట్ చేసిన 'శ్రీమతీ శీఘ్ర శ్రీ' ఎపిసోడ్ వి.సి.డి.ని వేసి చూపిస్తున్నారు... దాని తోపాటు వారిచ్చిన రెండు గోల్డ్ కాయిన్స్ (రెండు కాయిన్స్ - ఒక్కొక్కటి గ్రాముకు మించనివి)ని కూడా ఘనంగా చూపిస్తూ... లోలోపల కుమిలిపోతున్నారు.

☆

